

'బడిబాట' పట్టేనా?
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్చుకునేందుకు ఊరూరా ఉపాధ్యాయులు బడిబాట పట్టారు. 8లో▸



ధర అడిగితే నో స్టాక్
ఎరువుల దుకాణాల యజమానులు అడ్డగోలుగా దోచుకుంటున్నారని పలువురు రైతులు వాపోతున్నారు. 8లో▸



ఇద్దరికి రిమాండ్
డబ్బు కోసం మేనమామను హత్య చేసిన అల్లుడు, సహకరించిన స్నేహితుడిని చేవెళ్ల పోలీసులు రిమాండ్‌కు తరలించారు. 8లో▸

న్యూస్‌రీల్

ధారూరు మార్కెట్‌కు రూ.69.53 కోట్ల ఆదాయం



ధారూరు వ్యవసాయ మార్కెట్

ధారూరు: ధారూరు వ్యవసాయ మార్కెట్‌కు ఈ సంవత్సరం రూ.69.53 కోట్ల ఆదాయం సమకూరినట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి సిద్ధమ్మ శనివారం తెలిపారు. మండలంలోని నాగసమందర్‌లో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రం ద్వారా ధారూరు వ్యవసాయ మార్కెట్‌కు రూ. 49.53 కోట్లు ఫీజు రూపంలో వచ్చినట్లు తెలిపారు. పత్తి కొనుగోలు కేంద్రాన్ని నవంబర్ 20, 2023లో ప్రారంభించారు. ఫిబ్రవరి 9, 2024 వరకు కొనుగోలు చేసినట్లు వివరించారు. రూ.49,53,36,677 విలువ చేసే 71 లక్షల 393 కిలోల 36 గ్రాముల పత్తిని రైతుల నుంచి సేకరించినట్లు పేర్కొన్నారు. దీంతో వ్యవసాయ మార్కెట్‌కు ఫీజు రూపంలో రూ.49,53,367 ఆదాయం వచ్చిందన్నారు. దీంతో పాటు మరో రూ.20 లక్షలు ఆదాయం సమకూరినట్లు వివరించారు.

గొట్టిముక్ల జెడ్పీహెచ్ఎస్‌ను సందర్శించిన డీఈఓ



అనంతగిరి: వికారాబాద్ మండలం గొట్టిముక్ల జెడ్పీహెచ్ఎస్‌ను శనివారం జిల్లా విద్యాధికారి రేణుకాదేవి సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. అనంతరం పుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీపై ఆరా తీశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని, మధ్యాహ్న భోజనం పథకం గురించి తెలుసుకున్నారు. ఆమె వెంట పాఠశాల హెచ్ఎం స్వప్న, ఉపాధ్యాయులు ఉన్నారు

పంచాయతీ కార్మికులతో ప్రభుత్వం వెట్టిచాకిరీ

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

బషీరాబాద్: గ్రామ పంచాయతీ కార్మికులతో సర్కారు 7 నెలలుగా వెట్టిచాకిరీ చేయిస్తోందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ మండిపడ్డారు. పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ శనివారం బషీరాబాద్ ఎంపీడీఓ కార్యాలయం వద్ద కార్మికులతో కలిసి ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీపీల్లో వివిధ కేటగిరిల్లో పని చేస్తున్న కార్మికులకు నెలనెలా వేతనం చెల్లించకుంటే వారు ఎలా బతకాలని నిలదీశారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ 51 సవరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. లేదంటే ఎమ్మెల్యే ఇంటి ముందు కార్మికులతో కలసి ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. ప్రతి కార్మికుడికి నెలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ డివిజన్ నాయకుడు సురేష్, కార్మికులు శ్యామప్ప, అంనతయ్య, దేవమ్మ, భీమమ్మ, అంజిలప్ప తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించాలి

టీఎస్ యూటీఎఫ్



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న టీఎస్ యూటీఎఫ్ నాయకులు

అనంతగిరి: ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులను పారదర్శకంగా నిర్వహించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ వెంకటరత్నం, ఏ రాములు కోరారు. శనివారం ఈ మేరకు డీఈఓ రేణుకాదేవికి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. జిల్లాలో అన్ని కేటగిరీల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను గోప్యత లేకుండా చూపించాలన్నారు. బదిలీలు, పదోన్నతులపై ప్రభుత్వ మార్గదర్శకాలను, నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు.

కలెక్టర్ బదిలీ

నల్లగొండ కలెక్టర్‌గా వెళ్లిన నారాయణరెడ్డి

- జిల్లాలో ఏడాదిన్నర పాటు సేవలు
- పాలనలో తనదైన ముద్ర
- అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మకు పదోన్నతి.. జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్‌గా ఉత్తర్వులు
- కొత్త కలెక్టర్‌గా ప్రతీక్ జైన్

వికారాబాద్: జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) రాహుల్‌శర్మ బదిలీ అయ్యారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వం 20 మంది ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో మన జిల్లా కలెక్టర్ తోపాటు అడిషనల్ కలెక్టర్ కూడా ఉన్నారు. వికారాబాద్ జిల్లా కొత్త కలెక్టర్‌గా ప్రతీక్‌జైన్ ఐఏఎస్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2023 ఫిబ్రవరి 2న కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన నారాయణపేట జిల్లా వాస్తవ్యుడైన నారాయణరెడ్డి ఏడాది నాలుగు నెలల 17 రోజులు సేవలందించారు. ఆయన్ను నల్లగొండ జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేశారు. జిల్లా అడిషనల్ కలెక్టర్‌గా రాహుల్‌శర్మ 2022 నవంబర్ 14న బాధ్యతలు చేపట్టారు. ఏడాది ఏడు నెలల పాటు సేవలందించారు.

పాలనపై తనదైన ముద్ర

కలెక్టర్‌గా నారాయణరెడ్డి బాధ్యతలు నిర్వహించింది సంవత్సరం నాలుగున్నర నెలలే అయినా పాలనపై తనదైన ముద్రవేశారు. అంతకుముందు పని చేసిన కలెక్టర్‌పై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్న సమయంలో బాధ్యతలు స్వీకరించిన ఆయన అనతికాలంలోనే పాలనను గాడిలో పెట్టడంలో సఫలమయ్యారు. రైతులు, ఇతర వర్గాల ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం ద్వారా జిల్లా వాసులకు దగ్గరయ్యారు. ఓ పక్క సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు చేర్చడంతో పాటు మరో పక్క వరుసగా వచ్చిన ఎన్నికలను సజావుగా నిర్వహించడంలో సక్సెస్ అయ్యారు. ఆయన జిల్లాకు వచ్చీ రాగానే అన్ని శాఖల అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ప్రజలకు సత్వర సేవలు అందటంతో పాటు జాప్యం లేకుండా చూశారు. జియో అటెండెన్స్ విధానం తెచ్చి అన్ని శాఖల పనితీరును మెరుగపరిచారు. అంతటితో ఆగకుండా తరచూ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అధికారులను అప్రమత్తం చేస్తూ వచ్చారు. ధరణి సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగారు. నిరంతర సమీక్షలతో యంత్రాంగాన్ని పరుగులు పెట్టించారు. ఈ క్రమంలో ఆరోగ్యశాఖ పరంగా సేవల్లో జిల్లా ముందు వరుసలో నిలవడం, ఉపాధి హామీలో సైతం రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవడం, జీపీలకు అవార్డులు రావటం లాంటి ఫలితాలను చూశాం. గత కలెక్టర్లతో పోలిస్తే ప్రజలకు ఎక్కువ సమయం అందుబాటులో ఉంటూ వచ్చారు. ప్రజలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇలా అన్ని వర్గాలను సమన్వయం చేయడంలోనూ పాలనలో తనదైన ముద్ర వేశారు.



బదిలీ అయిన కలెక్టర్ నారాయణరెడ్డి



కలెక్టర్‌గా పదోన్నతి పొందిన రాహుల్ శర్మ



కొత్త కలెక్టర్ ప్రతీక్‌జైన్

జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్‌గా రాహుల్‌శర్మ

2017 బ్యాచ్‌కు చెందిన రాహుల్‌శర్మ ఐఏఎస్ 2022 నవంబర్ 7న వికారాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్(లోకల్ బాడీస్)గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నవంబర్ 14న బాధ్యతలు స్వీకరించారు. జిల్లాలో ఏడాది ఏడు నెలలు స్థానిక సంస్థల బాధ్యతల్లో కొనసాగారు. సేవలందించటంలో వివాదరహితుడిగా, సౌమ్యుడిగా పేరు తెచ్చుకున్నారు. ప్రస్తుతం ఆయన్ను జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

జిల్లా కలెక్టర్‌గా ప్రతీక్‌జైన్

జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి బదిలీ కావడంతో ఆ స్థానంలో ప్రతీక్‌జైన్ ఐఏఎస్(2017 బ్యాచ్) నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్‌గా సేవలందిస్తున్నారు. గతంలో రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్‌గా పనిచేశారు.

కంది ధర అదుర్స్

హోల్‌సేల్ మార్కెట్‌లో భారీగా పెరుగుదల

- దాల్ మిల్లుల్లో క్వింటాలుకు రూ.17,800
- బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.200 నుంచి రూ.210 వరకు..



తాండూరు: తాండూరు కందిపప్పుకు జాతీయ స్థాయిలో డిమాండ్ పెరిగింది. మూడేళ్ల క్రితం ఇక్కడి పప్పునకు భౌగోళిక గుర్తింపు లభించింది. దీంతో మార్కెట్‌లో ధరలు భారీగా పలుకుతున్నాయి. గత సీజన్‌లో క్వింటాలు కందులకు రూ.11 వేల నుంచి రూ.13 వేల వరకు ధర పలకగా ఈ ఏడాది జనవరి నెల నుంచి ఇప్పటి వరకు ధరలు రోజు రోజుకూ పెరిగిపోతూ వస్తున్నాయి. పక్షం రోజుల నుంచి క్వింటాలు కంది పప్పు రూ.17,800 ధర పలికి రికార్డు సృష్టిస్తోంది. మరోవైపు కంది పంట దిగుబడులు భారీగా పడిపోవడంతో ధరలకు రెక్కలొచ్చాయని మార్కెట్ వర్గాలు అంటున్నాయి.

గతేడాది 1.60 లక్షల ఎకరాల్లో..

జిల్లాలో గతేడాది సుమారు 1.60 లక్షల ఎకరాల్లో కంది పంట సాగు చేయగా డిసెంబర్ నుంచి ఉత్పత్తులు మార్కెట్‌లోకి వస్తున్నాయి. సీజన్ ప్రారంభంలో క్వింటాలు కందులు రూ.10,500 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది. మార్చి నుంచి ధరలు పెరుగుతూ వచ్చాయి. ప్రస్తుతం తాండూరు మార్కెట్‌లో క్వింటాలుకు కనిష్ఠ ధర రూ.12 వేలు పలకగా గరిష్ఠ ధర రూ.13 వేలు పలికాయి. గతేడాది వానాకాలంలో సాగు చేసిన కంది పంట విస్తీర్ణం ఆధారంగా సుమారు 6లక్షల నుంచి 8లక్షల క్వింటాళ్ల వరకు దిగుబడి రావాల్సి ఉండగా భారీ వర్షాల కారణంగా పంటలు దెబ్బతిన్నాయి. దీంతో ఆశించిన స్థాయిలో దిగుబడి అందలేదు.

ఎనిమిదేళ్ల తర్వాత రికార్డు స్థాయి ధర

కంది పప్పు ధరలు ఎనిమిదేళ్ల తర్వాత మళ్లీ రికార్డు స్థాయికి చేరాయి. 2015 - 2016 సంవత్సరాల్లో క్వింటాలు కంది పప్పు రూ.20 వేల ధర పలికింది. తర్వాత అధిక విస్తీర్ణంలో కంది పంట సాగు చేయడంతో ధరలు సాధారణ స్థాయికి వచ్చాయి.

రికార్డు స్థాయిలో ధరలు

హోల్‌సేల్ మార్కెట్‌లో కంది పప్పుకు అధిక ధర పలుకుతోంది. జనవరి నెలలో క్వింటాలు కంది పప్పు రూ.15,500 ఉండగా ప్రస్తుతం తాండూరు మార్కెట్‌లో హోల్‌సేల్ ధర క్వింటాలుకు రూ. 17,800 ధర పలుకుతోంది. రిటైల్ మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.180 నుంచి రూ. 210 వరకు ధర పలుకుతోంది.

డిమాండ్ పెరిగింది

తాండూరు కంది పప్పుకు జాతీయ స్థాయిలో డిమాండ్ పెరిగింది. దీంతో మంచి ధర పలుకుతోంది. ప్రస్తుత సీజన్ ప్రారంభమైన నాటి నుంచి వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. దీంతో సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది.

– వీరేందర్, దాల్‌మిల్ యజమాని

వైద్య ఆరోగ్య సేవలు భేష్

ప్రశంసించిన డైరెక్టర్ డాక్టర్ రవీంద్రనాయక్

అనంతగిరి: వివిధ ఆరోగ్య కార్యక్రమాల అమల్లో జిల్లా రాష్ట్ర స్థాయిలో 5వ స్థానంలో నిలవడం అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర నాయక్ కొనియాడారు. శనివారం వికారాబాద్‌లోని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లా పరిధిలో అమలవుతున్న వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై ప్రోగ్రాం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా విభాగాల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. వాటి అమలుపై ఆరా తీశారు. మరింత మెరుగ్గా పనిచేసి జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ పల్వాన్‌కుమార్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రవీంద్ర యాదవ్, డాక్టర్ జీవరాజ్, డాక్టర్ సాయిబాబా, డాక్టర్ రతన్‌లాల్, డాక్టర్ బుచ్చిబాబు, డాక్టర్ నిరోష తదితరులు పాల్గొన్నారు.

చన్గోముల్ పీహెచ్‌సీ సందర్శన

పూడూరు: మండలంలోని చన్గోముల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ రవీంద్రనాయక్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి పని తీరు, సిబ్బంది పూర్తిస్థాయిలో ఉన్నారా అనే విషయాన్ని డాక్టర్ బెజలీల్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో మందులు, సమస్యలపై ఆరా తీశారు. ప్రజలకు ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం కలిగేలా వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ప్రైమరీ హెల్త్ సెంటర్ల పని తీరును అడిగి తెలుసుకున్నారు.



అనంతగిరి: వైద్యాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న రవీంద్రనాయక్

బీటెక్ విద్యార్థి బలవన్మరణం

ఆర్థిక ఇబ్బందులా.. మరేదైనా కారణమా..?

ఇబ్రహీంపట్నం: బీటెక్ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన ఇబ్రహీంపట్నంలోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐలు రామకృష్ణ, మైబెల్లి తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం, మాముసూర్ గ్రామానికి చెందిన సంగెపు నరేంద్ర (27) ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ఆదిబట్ల ఏరోస్పేస్‌లో పార్ట్ టైం జాబ్ చేస్తూ ఇబ్రహీంపట్నం ఎంబీఆర్ నగర్‌లోని ఎస్‌వీ బాయ్స్ హాస్టల్ ఉంటున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి హాస్టల్ రెండో అంతస్తులోని తన గదిలో బెడ్ షీట్‌తో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. షాపింగ్ కోసం నగరానికి వెళ్లిన రూం మేట్స్ వచ్చి చూసేసరికి విగతజీవిగా మారి కనిపించాడు. దీంతో వారు హాస్టల్ యజమాని వేణుకు సమాచారం ఇచ్చారు. వెంటనే మృతుని కుటుంబసభ్యులు, పోలీసులకు విషయాన్ని తెలియజేశారు. మృతుని తండ్రి రాంబాబు, బంధువులు శనివారం ఉదయం హాస్టల్‌కు చేరుకుని బోరున విలపించారు. తమకు ఎవరిపైనా అనుమానం లేదని, ఆర్థిక ఇబ్బందులు కారణం కావచ్చని తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకోని స్థానిక ప్రభుత్వాస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. కాగా నరేంద్ర మొబైల్ ఫోన్ లాక్ ఓపెన్ కాలేదు. కాల్ డేటాను పరిశీలిస్తే ఆత్మహత్యకు ప్రేరేపించిన కారణాలు ఆర్థిక ఇబ్బందులా లేక మరేమైనా ఉన్నాయా అనేది స్పష్టమయ్యే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు.



సంగేపు నరేంద్ర (ఫైల్)

'ఉపాధి' సమస్యలు పరిష్కరించండి

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య

షాద్‌నగర్‌రూరల్: ఉపాధిహామీ చట్టంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య విమర్శించారు. పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో శనివారం వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి బుద్దుల జంగయ్య ఆధ్వర్యంలో 'ఉపాధి కూలీల సమస్యలు–పరిష్కార మార్గాలు' అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కాంతయ్య మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ చట్టం తీసుకురావాలని వామపక్ష పార్టీలు, వ్యవసాయ కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున పోరాటం చేశాయని అన్నారు. ఆ పోరాట ఫలితంగానే 2005లో అప్పటి యూపీఏ ప్రభుత్వం ఉపాధిహామీ చట్టానికి రూపకల్పన చేసిందని గుర్తు చేశారు. అనంతరం ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరితో రోజురోజుకూ నిర్వీర్యం అవుతున్న పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు అన్ని వసతులు కల్పించాలని, కూలీల సమస్యల పరిష్కారంకోసం కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ.. ఉపాధికూలీలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని, పని చేసే ప్రదేశంలో కూలీ మరణిస్తే రూ.5లక్షలు, 55 ఏళ్లు నిండిన కూలీలకు రూ.5వేల పెన్షన్, రోజుకు రూ.600 కూలీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పంచాయితీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ జిల్లా నాయకుడు వెంకటేశ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న కలకొండ కాంతయ్య

అక్రమ బదిలీలపై విచారణ జరిపించండి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఉపాధ్యాయ బదిలీల్లో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల అక్రమ బదిలీలతో డీఈడీ, బీఈడీ చేసిన జిల్లాకు చెందిన నిరుద్యోగులు అన్యాయానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జీవో నంబర్ 610తో స్థానికేతరులకు న్యాయం జరిగిందని, స్థానికులకు అన్యాయం జరిగిందన్నారు. జీవో 317 ప్రకారం క్యాడర్ స్ట్రెంత్, వర్కింగ్ పొజిషన్, వేకెన్సీ పొజిషన్ షెడ్యూలు కులాలు, తెగలకు సంబంధించిన రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తూ కేటాయింపులు చేయాల్సి ఉందన్నారు. కానీ జిల్లాలో ఈ నిబంధనలు పక్కన పెట్టి మహబూబ్‌నగర్, నల్లగొండ, ఖమ్మం, మంచిర్యాల, యాదాద్రి, సంగారెడ్డి ప్రాంతాల నుంచి ఉపాధ్యాయులను బదిలీ చేశారని మండిపడ్డారు. రూల్స్ పాటించకపోవడంతో ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. 400కుపైగా ఉపాధ్యాయులు నిబంధనలకు విరుద్ధంగా జిల్లాలోకి ప్రవేశించారని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో వనపర్తి జిల్లా ఇన్‌చార్జి బోసుపల్లి ప్రతాప్, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రమేష్, నాయకులు లక్ష్మీపతిగౌడ్, అశోక్‌గౌడ్, శ్రీశైలం పాల్గొన్నారు.



అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బొక్క నర్సింహారెడ్డి తదితరులు

విద్యార్థులకు ఇబ్బంది కలగొద్దు

కడ్తాల్: గిరిజన సంక్షేమ శాఖ వసతి గృహాల్లో ఉంటూ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు మెరుగైన వసతి కల్పించాలని, ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా సహాయ గిరిజన అభివృద్ధి అధికారి (ఏటీడీఓ) ఉడుతనూరి వెంకటయ్య అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ శాఖ బాలుర వసతి గృహం, ఆశ్రమ పాఠశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. వసతిగృహంతో పాటు పాఠశాల తరగతి గదులు, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని, బెడ్‌షీట్స్, కార్పెట్స్, రెండు జతల దుస్తులు, నోట్‌బుక్స్ అందించాలని సూచించారు. ఆశ్రమ పాఠశాలల్లో 3 నుంచి 10 వతరగతి వరకు ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. గిరిజన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం జిల్లాలోని గిరిజన సంక్షేమ వసతి గృహాలకు సంబంధించిన వంట సామగ్రిని ఆయా వసతి గృహాల సంక్షేమ అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమ అధికారులు రాములు, బాలరాజు, రాంచంద్రయ్య, మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏటీడీవో వెంకటయ్య

క్లుప్తంగా

అధ్యాపకుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

పరిగి: జాఫర్‌పల్లి ఆదర్శ పాఠశాలలో అధ్యాపక పోస్టులకు తాత్కాలిక ప్రాతిపదికన నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ యాదయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 6వ తరతి నుంచి 8వ తరగతి వరకు హిందీ, 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు వృక్షశాస్త్రం బోధించుటకు సంబంధిత సబ్జెక్టులో పీజీ చేసిన వారు అర్హులన్నారు. పీజీటీ పోస్టులు ఆంగ్లము, భౌతికశాస్త్రం, కామర్స్, సివిక్స్, జీవశాస్త్రంలో బోధించుటకు అర్హులైన వారు ఈనెల 18లోగా పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

దుద్యాల్: ఉచిత వైద్య శిబిరాన్ని పేదలు వినియోగించుకోవాలని శిబిరం నిర్వాహకులు సూచించారు. ఆదివారం స్థానిక జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో నిర్వహించే ఈ శిబిరం సాయి సేవా సమితి వనస్థలిపురం వారి సహకారంతో.. శ్రీగత సత్సంగ్ సేవా సమితి తాండూరు వారి సౌజన్యంతో నిర్వహిస్తున్నట్లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేస్తారన్నారు. ఇతర అనారోగ్య సమస్యలుంటే సంబంధిత ఆస్పత్రులకు రిఫర్ చేస్తారన్నారు.

మాధవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

బంట్వారం: జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కోట్‌పల్లి మండలం జిన్నారంలో ఈ నెల 16న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రాం ఇన్‌చార్జి మోహన్ రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉంటుందన్నారు.

నవాబుపేట ఎంపీడీఓగా అనురాధ



నవాబుపేట: నవాబుపేట ఎంపీడీఓగా సి.అనురాధ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన సుమిత్రమ్మ డిసెంబర్‌లో ఉద్యోగవిరమణ చేశారు. అప్పటి నుంచి సూపరిటెండెంట్ అజయ్‌కుమార్ ఇన్‌చార్జి ఎంపీడీఓగా బాధ్యతలు నిర్వర్తించారు.

సారా విక్రయిస్తే చర్యలు

తహసీల్దార్ కిషన్



తహసీల్దార్ కిషన్ ఎదుట బైండోవర్ చేస్తున్న ఎక్సైజ్ పోలీసు

పెద్దేముల్: నిషేధిత సారాను విక్రయిస్తే మొదటి సారి బైండోవర్ మరో సారి రూ.2లక్షల జరిమానాతో పాటుగా చట్టపరమైన చర్యలుంటాయని తహసీల్దార్ కిషన్ అన్నారు. శనివారం మండల పరిధిలోని కందనెల్లితండాకు రాథోడ్ కాంతాబాయి సారాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో తాండూరు ఎక్సైజ్ పోలీసులు దాడులు చేసి పట్టుకుని పెద్దేముల్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఎక్సైజ్ కానిస్టేబుల్ కృష్ణ తదితరులున్నారు.

స్లాటరింగ్ సర్టిఫికెట్ తప్పనిసరి

సీఐ నాగారాజు



మాట్లాడుతున్న సీఐ నాగరాజు

అనంతగిరి: బక్రీద్‌లో ఉపయోగించే జంతువులకు ఖచ్చితంగా ఫిట్‌ఫర్ స్లాటరింగ్ సర్టిఫికెట్ ఉండాలని వికారాబాద్ సీఐ నాగరాజు అన్నారు. ఎస్పీకోటిరెడ్డి ఆదేశాల మేరకు శనివారం ఆయన వికారాబాద్ ఠాణాలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించి పండుగా ప్రశాంతంగా చేసుకోవాలన్నారు.

‘బడిబాట’ పట్టేనా?

- సౌకర్యాలున్నా పెరగని విద్యార్థుల సంఖ్య
- ఇంటింటి ప్రచారం చేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు



దౌల్తాబాద్‌లో ఉపాధ్యాయుల బడిబాట

దౌల్తాబాద్: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్చుకునేందుకు ఊరూరా ఉపాధ్యాయులు బడిబాట పట్టారు. పాఠశాలలోని మౌలిక వసతులు వివరిస్తూ ఇంటింటా తిరుగుతూ విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని శతవిధాల ప్రయత్నిస్తున్నారు. ఒక వైపు మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య అంతంత మాత్రంగానే ఉండడంతో ఉపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు తమ విద్యార్థులు చేజారిపోకుండా ఇప్పటికే ఒక దఫా ఊరూరా ప్రచారం పూర్తి చేశారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులను పాఠశాలల్లో చేర్చుకునేందుకు ఉపాధ్యాయులు ఇంటింటా తిరుగుతున్నారు. తమలోని నైపుణ్యాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో భోధన, వసతులు కల్పిస్తున్నామంటూ విద్యార్థుల తల్లిదండ్రులకు వివరిస్తూ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఉపాధ్యాయులు స్థానికంగా లేకపోవడంతో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఇదే సాకుగా చూపి అన్ని వేళల్లో అందుబాటులో ఉంటామంటూ విద్యార్థుల తల్లిదండ్రులను ఆకట్టుకుని ప్రభుత్వ పాఠశాలల అడ్మిషన్లు కొల్లగొడుతున్నారు.

45 పాఠశాలల్లో 26 మంది అడ్మిషన్లు

బడిబాటలో భాగంగా మండల వ్యాప్తంగా జూన్ 3నుంచి శనివారం వరకు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. నిత్యం వివిధ కార్యక్రమాలతో జూన్ 19వరకు బడిబాట నిర్వహించనున్నారు. గతేడాది నుంచి మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా ప్రతి పాఠశాలలో 8వ తరగతి వరకు ఇంగ్లీషు మీడియం ప్రారంభిస్తుండడంతో మండల వ్యాప్తంగా 26 మంది విద్యార్థులు మాత్రమే చేరేందుకు పేర్లు నమోదు చేసుకున్నారు.

తల్లిదండ్రులకు వివరిస్తున్నాం



ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయుల నైపుణ్యత, పాఠశాలలో వసతులు, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పంపిణీ వంటి అన్ని విషయాలు తల్లిదండ్రులకు వివరిస్తూ విద్యార్థులను చేర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నాం. ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల్లోని ప్రత్యేకతలు వివరించే కరపత్రాలు ముద్రించి ప్రచారం చేస్తున్నారు.

– వెంకటయ్య, ఎంఈఓ, దౌల్తాబాద్

ధర అడిగితే.. ‘నో స్టాక్’

- దుకాణాదారులు చెప్పిన రేటు పెడితేనే విత్తనాలు, ఎరువులు
- కృత్రిమ కొరత సృష్టిస్తున్న యజమానులు
- ఇబ్బంది పడుతున్న రైతులు



విక్రయానికి సిద్ధంగా ఉంచిన పత్తి విత్తనాలు

పెద్దేముల్: వానాకాలం విత్తనాలు నాటిన నాటినుంచి పంట చేతికి వచ్చే వరకు ఎరువుల దుకాణాల యజమానులు తమను అడ్డగోలుగా దోచుకుంటున్నారని పలువురు రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు, విత్తనాలు విక్రయించాలని వ్యవసాయ, పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తున్నా అవి క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని ఆరోపిస్తున్నారు. వారికి ఇష్టం వచ్చిన ధరలకు విక్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధరల పట్టిక, స్టాక్ బోర్డు మచ్చుకైనా కనబడడం లేదు. అధికారులు నామ మాత్రంగా తనిఖీలు చేయడం, అధిక ధరలకు విక్రయాలు చేస్తున్నారని ఫిర్యాదులు చేసిన ప్రశ్నించే వారు లేకపోవడంతో అడ్డగోలు ధరలకు అమ్ముతున్నారని అన్నదాతలు వాపోతున్నారు. ప్రస్తుతం పత్తి విత్తనాలకు డిమాండ్ ఉండడంతో వాటిని వేర్వేరు చోట్ల నిల్వ ఉంచి డిమాండ్‌ను సాకుగా చూపుతూ రూ.వేయి నుంచి రూ.1,200 వరకు అధికంగా విక్రయిస్తున్నారు. యూరియాను రూ.300 నుంచి రూ.330 ప్రకారం అమ్ముతూ ఒక్కో బస్తాపై రూ.50 వరకు అక్రంగా సొమ్ము చేసుకుంటున్నారు. ఇదేమని రైతులు ప్రశ్నిస్తే ఎరువులు స్టాక్ లేవు.. బిల్లులు లేవంటూ దబాయిస్తున్నారని సమాచారం. మూడేళ్లుగా ఇదే తంతు జరుగుతున్నా ఏ అధికారి ఇప్పటి వరకు కేసు నమోదు చేసిన దాఖలాలే లేవని నాగులపల్లి, మంబాపూర్, ఇందూరు, కందనెల్లి, పెద్దేముల్, మారేపల్లితో పాటు పలు గ్రామాల రైతులు అంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆకస్మిక తనిఖీలు చేసి అధిక ధరలకు విక్రయాలు చేస్తే ఎరువుల దుకాణాలపై చర్యలు తీసుకోవడంతో పాటు సంబంధిత అధికారులపై సైతం చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు. ఈ విషయమై మండల ఏఓ నజీరుద్దీన్‌ను వివరణ కోరగా అధిక ధరలకు విక్రయాలు చేస్తే తమకు వ్రాత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

రక్తదానం.. ప్రాణదానంతో సమానం

మార్వాడీ యువమంచ్ అధ్యక్షుడు అనిల్ సార్డా



రక్తదానం చేస్తున్న మార్వాడీ యువమంచ్ సభ్యులు

తాండూరు టౌన్: రక్తదానం.. ప్రాణదానంతో సమానమని మార్వాడీ యువమంచ్ అధ్యక్షుడు అనిల్‌సార్డా అన్నారు. శనివారం ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా మార్వాడీ యువమంచ్ ఆధ్వర్యంలో స్థానిక బాలాజీ మందిర్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 21 మంది యువమంచ్ సభ్యులు రక్తదానం చేశారు. ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలోని రక్తనిధి కేంద్రంలో రక్తనిల్వలు అవసరమనే ఉద్దేశ్యంతో ఈ శిబిరాన్ని నిర్వహించామన్నారు. ఈ శిబిరంలో రక్తదానం చేసిన సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచ్ కార్యదర్శి సచిన్ రాఠి, కోశాధికారి అరుణ్ సార్డా, సభ్యులు ఓం ప్రకాశ్ సోమాని, రామానుజ్ దాస్‌సోని, రాంనారాయణ్ బూబ్, మన్మోహన్ సార్డా, భగవాన్‌దాస్ బూబ్, సూర్యప్రకాశ్ సోని, మహేష్ సార్డా, దీపక్ గగరాణి, శిబిర కన్వీనర్ కరన్‌జైన్, కోకన్వీనర్ రమాకాంత్ పండిట్ తదితరులు పాల్గొన్నారు.

కదులుతున్న రైలు దిగి మహిళ దుర్మరణం

శంకర్‌పల్లి: కదులుతున్న రైలు దిగిన మహిళ మృతి చెందింది. ఈ ఘటన శంకర్‌ల్లి రైల్వేస్టేషన్‌లో చోటు చేసుకుంది. వికారాబాద్ రైల్వే ఎస్‌ఐ శంకరయ్య తెలిపిన ప్రకారం.. వికారాబాద్ నుంచి గుంటూరు వెళ్తున్న పల్నాడు ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 2.15గంటలకు శంకర్‌పల్లి చేరుకుంటోంది. ఈ సమయంలో ఆ రైలు ఆగక ముందే గుర్తు తెలియని ఓ మహిళ(45) దిగే ప్రయత్నం చేయగా చేతులు, తల పట్టాలపైకి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు, స్టేషన్ సిబ్బంది సమాచారం మేరకు రైల్వే పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఎలాంటి ఆధారాలు లభించకపోవంతో గుర్తు తెలియని మహిళగా కేసు నమోదు చేసుకుని శవాన్ని వికారాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి అదృశ్యం



అంజి (ఫైల్)

షాద్‌నగర్ రూరల్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వివాహిత అదృశ్యమైంది. ఈ ఘటన షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శనివారం ఏఎస్‌ఐ వెంకటేశ్ తెలిపిన ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం చెన్నాయపల్లి తండాకు చెందిన రవినాయక్, అంజి దంపతులు షాద్‌నగర్‌కు వలసొచ్చాడు. పట్టణంలోని సాంబశివ కాలనీలో నివాసం ఉంటూ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 8న ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన అంజి తిరిగి రాలేదు. ఆమె భర్త ఎక్కడ వెతికినా ఆచూకీ లభ్యమవ్వలేదు. దీంతో ఆయన పోలీసులను ఆశ్రయించాడు. మహిళ ఆచూకీ తెలిసినా, వివరాలు తెలిసినా పోలీస్‌స్టేషన్‌లోగాని 9849163374, 9182773308 నంబర్లలో సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

విధులకు వెళ్లిన సెక్యూరిటీ గార్డు..



సుధీర్ (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్: విధులకు వెళ్తున్నాని ఇంట్లో చెప్పి వెళ్లిన ఓ సెక్యూరిటీ గార్డు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. తొర్రూర్ గ్రామంలో నివాసముండే లోగిశ సుధీర్ (30) గతేడాదిగా బాటసింగారం పంచాయతీ పరిధి కొత్తగూడెంలోని లాజిస్టిక్ పార్కులో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఈ నెల 11న ఉదయం 7గంటలకు విధులకు వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లిన సుధీర్ తిరిగి ఇంటికి రాలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. సుధీర్ తండ్రి త్రినాథ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అవిశ్వాస తీర్మానానికి అడుగులు!

- శంషాబాద్ మున్సిపల్ పీఠంపై కాంగ్రెస్ కన్ను
- ఇటీవల ఆ పార్టీలో చేరిన ఆరుగురు కౌన్సిలర్లు
- మరికొందరిని కూడగట్టేందుకు ప్రయత్నం



శంషాబాద్ : శంషాబాద్ మున్సిపాలిటీని కైవసం చేసుకునేందుకు కాంగ్రెస్ పార్టీ వడివడిగా అడుగులు వేస్తోంది. ప్రస్తుతం బీఆర్ఎస్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఉన్న శంషాబాద్ మున్సిపాలిటీ పీఠాన్ని దక్కించుకోవాలని ముమ్మరంగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికలకు కొద్ది రోజుల ముందు బీఆర్ఎస్ నుంచి ఆరుగురు కౌన్సిలర్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గతంలో ఇద్దరే ఉన్న కాంగ్రెస్ కౌన్సిలర్ల బలం ఎనిమిదికి చేరింది. మొత్తం 25 మంది కౌన్సిలర్లు ఉన్న శంషాబాద్ మున్సిపాలిటీలో మరో ఐదురుగు కౌన్సిలర్లు కాంగ్రెస్ వైపు మొగ్గుచూపితే మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠాన్ని దక్కించుకోవచ్చనే ఆశాభావంతో ఉన్నారు. ఈ మేరకు కాంగ్రెస్ కీలక నేతలు కూడా పట్టణ కాంగ్రెస్ కౌన్సిలర్లకు వెన్నుదన్నుగా నిలి స్తూ పావులు కదుపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

జోరుగా చర్చలు..

మిగతా కౌన్సిలర్ల మద్దతు కూడగట్టేందుకు గత వారం రోజులుగా కాంగ్రెస్ పార్టీ నుంచి చర్చలు ఊపందుకున్నప్పటికి ఇంకా ఓ కొలిక్కిరాలేదు. కొందరు కౌన్సిలర్లు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపేందుకు ఆసక్తిగా ఉన్నప్పటికి భవిష్యత్తు రాజకీయాలపై అంతర్గతంగా తర్జనభర్జనలు పడుతున్నారు. మరో ఆరునెలల్లో మున్సిపాలిటీల గడువు ముగిసిన తర్వాత మున్సిపాలిటీ కొనసాగుతుందా..? లేదా గ్రేటర్‌లో విలీనమవుతుందా...? అంశాలు కూడా నిర్ణయంలో కీలకంగా మారుతోంది. ఒక వేళ గ్రేటర్‌లో విలీనం ఖాయమైతే కాంగ్రెస్ పెట్టే అవిశ్వాసానికి మద్దతు ఇచ్చినా పెద్దగా నష్టమేమి ఉండదనే ఆలోచన కూడా కొందరు ప్రజాప్రతినిధుల్లో ఉంది. అవిశ్వాసానికి పదిహేను సంఖ్య సరిపిపోయినప్పటికి నోటీసు ఇచ్చే సమయానికి కనీసంగా పదిహేడు మంది సంఖ్య ఉండాలనే నిబంధన కూడా కాంగ్రెస్ పార్టీకి కొంత సంక్లిష్టంగా మారుతుందనే చర్చలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గంలో ఇప్పటికే ఓ మున్సిపాలిటీ, కార్పొరేషన్‌ను చేజిక్కించుకున్న కాంగ్రెస్ శంషాబాద్‌ను కూడా తమ ఖాతాలో వేసుకునేందుకు పట్టుదలతో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఇందులో చర్చలు సఫలమైతే అనుకున్నది సాధ్యమవుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

స్నేహితుడి మృతికి కారణమైన వ్యక్తులకు రిమాండ్

శంకర్‌పల్లి: పందెం కాసి స్నేహితుడి మృతికి కారణమైన ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన శనివారం శంకర్‌పల్లి ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. ఈ నెల 1న చెందిప్ప గ్రామానికి సురేందర్, మల్లేశం, మాణిక్యం ముగ్గురు స్నేహితులు ఊరి బయటకి వెళ్లి సరదాగా మాట్లాడుకుంటూ కూర్చున్నారు. పురుగు మందు తాగితే రూ.లక్ష ఇస్తామని మల్లేశం, మాణిక్యం పందెం వేశారు. ఇందుకు స్పందించిన సురేందర్ పురుగు మందు తాగి ఆస్పత్రి పాలయ్యాడు. ఉస్మానియాలో చికిత్స పొందుతున్న ఆయన శుక్రవారం మృతి చెందగా.. కుటుంబ సభ్యుల ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సురేందర్ మృతి కారణమైన ఇద్దరు స్నేహితులు మల్లేశం, మాణిక్యంలను శనివారం శంకర్‌పల్లి పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం వారిని చేవెళ్ల మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరిచారు. 14రోజుల రిమాండ్ నిమిత్తం సంగారెడ్డి జిల్లా కంది జైలుకి పంపారు.

ఆటోను ఢీకొట్టిన కారు

నలుగురికి గాయాలు

బొంరాస్‌పేట: తాండూరు నుంచి కొడంగల్ వెళ్తున్న ఓ ఆటోను కారు ఢీ కొట్టింది. ఈ ఘటన మండల కేంద్రం శివారులోని నమాజ్ గుట్ట వద్ద శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రవూఫ్ తెలిపిన ప్రకారం.. కొడంగల్‌కు చెందిన నలుగురు వ్యక్తులు జానకంపల్లిలో ఓ శుభకార్యానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో నమాజ్‌గుట్ట వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న కారు అతివేగంతో ఆటోను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు గాయపడ్డారు. గమనించిన స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కొడంగల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

భూ వివాదంలో పరస్పర దాడులు



దాడికి ఉపయోగించిన గొడ్డలి, కర్రలు

ఒకరికి తీవ్రగాయాలు



గాయపడిన రామకృష్ణ

దోమ: భూ వివాదంలో ఒకరు తీవ్రంగా గాయపడగా.. పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం దోమ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఆనంద్ తెలిపిన ప్రకారం .. నారాయణపేట జిల్లా కోస్గి మండం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బుసకోటి రామకృష్ణకు మండల పరిధిలోని గుండాల శివారులో భూములున్నాయి. అదే గ్రామానికి చెందిన దాయాదులు పిట్ల కృష్ణయ్య, వెంకటరాములు, సాయిలు, శివకు అక్కడే భూములున్నాయి. వీరి నడుమ కొంతకాలంగా భూ తగాదాలు కొనసాగుతునర్నాయి. సర్వే నంబర్ 73లో కొంత భాగం తమకు వస్తుందని దాయాదులు రామకృష్ణను కోరారు. ఇందుకు సర్వే సైతం చేయించినా ఆయన నిరాకరించాడు. దీంతో పరస్పరం గొడ్డలి, కర్రలతో దాడి చేసుకునేంత వరకు వెళ్లింది. ఈ ఘర్షణలో రామకృష్ణపై గొడ్డలితో దాడి చేయడంతో తీవ్రగాయాలవ్వగా దాయాదులకు స్వల్ప గాయాలయ్యాయి. ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం

తుర్కయంజాల్: గ్రామీణ వైద్యులపై అధికారులు దాడులను ఆపాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొల్లేపల్లి శ్రీనివాసరాజు కోరారు. అధికారులు, పోలీసులు గ్రామీణ ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితుల్లో ప్రథమ చికిత్స అందిస్తున్న వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వివరించామన్నారు. ఇందుకు స్పందించిన ముఖ్యమంత్రి సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ సంగీతతో మాట్లాడి దాడులు చేయవద్దని చెప్పినట్లు వివరించారు. ముఖ్యమంత్రి నిర్ణయాన్ని హర్షిస్తూ శనివారం తుర్కయంజాల్ చౌరస్తాలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామీణ వైద్యులకు శిక్షణను ఇచ్చినట్లు వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం కార్యదర్శి ఉపేందర్, సభ్యులు రమేశ్, జయప్రకాశ్, శంకర్, జింతేదర్, వెంకటేశ్వర రావు, ప్రవీణ్ సింగ్, నరేశ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించాలి

పూర్ణా మలావత్

మీర్‌పేట: మగవారికి దీటుగా ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని మౌంట్ ఎవరెస్ట్ అధిరోహించిన పూర్ణా మలావత్ అన్నారు. జిల్లెలగూడ లార్డ్స్ పాఠశాలలో శనివారం నూతన విద్యాసంవత్సరం ప్రారంభోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. తాను 13 ఏళ్ల నుంచే కొండలను ఎక్కడం నేర్చుకుని సాధన చేయడం వల్లే మౌంట్ ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించగలిగానని తెలిపారు. భువనగిరితో పాటు ఇతర చోట్ల చిన్నారులకు ట్రెక్కింగ్‌లో శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. అనంతరం ఆమెను పాఠశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ సిద్ధాల బీరప్ప, డైరెక్టర్ సిద్ధాల శ్రీలత, ప్రిన్సిపాల్ మరియస్ మధాను పాల్గొన్నారు.

మేనమామ హత్యకేసులో ఇద్దరికి రిమాండ్

పరారీలో మరో నిందితుడు

- స్కూటీ, కత్తి, రెండు సెల్‌ఫోన్లు సీజ్



చేవెళ్ల: కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ లక్ష్మారెడ్డి, ఎస్ఐ ప్రదీప్‌కుమార్

చేవెళ్ల: డబ్బు కోసం మేనమామను హత్య చేసిన అల్లుడు ఇందుకు సహకరించిన అతడి స్నేహితుడిని చేవెళ్ల పోలీసులు రిమాండ్‌కు తరలించారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో సీఐ లక్ష్మారెడ్డి, ఎస్ఐ ప్రదీప్‌కుమార్ కేసు వివరాలను వెల్లడించారు. తంగడపల్లికి చెందిన రుల్లాఖాన్ అలియాస్ సలీంఖాన్ కుటుంబం 15 ఏళ్లుగా హైదరాబాద్‌లోని మలక్‌పేట్‌లో నివాసం ఉంటున్నారు. మృతుడికి, అతని అన్న అన్వర్‌ఖాన్‌కు కలిపి తంగడపల్లిలో కొంత వ్యవసాయ భూమి ఉంది. నగరంలోని జీర్రాలో ఉండే వీరి అక్క కొడుకు ఖాజాపాషా కొన్నాళ్లుగా భూమిలో వాటా అడుగుతున్నాడు. ఇదే విషయంలో ఎనిమిది నెలల క్రితం పంచాయితీ పెట్టగా అన్వర్‌ఖాన్ భూమికి బదులుగా రూ.14లక్షలు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. చిన్న మామ రుల్లాఖాన్ రూ.2లక్షలు ఇస్తాననగా ఎక్కువ డబ్బు డిమాండ్ చేశాడు. అందుకు ఆయన నిరాకరించడంతో ఎలాగైనా అంతమొందించాలని ఖాజాపాషా నిర్ణయించుకున్నాడు. ఈ నెల 13న గ్రామంలో ఒంటరిగా ఉంటున్న మేనమామ దగ్గరకు అతని స్నేహితుడు, ఆటో డ్రైవర్ షేక్ ముస్తాఫా, దారుసలాంలో ఉండే అప్సర్‌తో కలిసి స్కూటీపై వచ్చారు. రాత్రి ఇదేవిషయం మాట్లాడగా పొద్దున మాట్లాడుకుందాం పడుకోండి అని చెప్పాడు. పథకం ప్రకారం పడుకున్నట్లు నమ్మించి ఖాజాపాషా వెంట తెచ్చుకున్న కత్తితో మేనమామ కడుపులో పొడిచి హత్య చేశాడు. స్నేహితుడు ముస్తాఫా నోరు మూయగా విచక్షణారహితంగా పొడవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం వారు ముగ్గురు స్కూటీపై వెళ్తుండగా గ్రామస్తులు అనుమానంతో వెంబడించగా బండి వదిలి పారిపోయారు. ఉదయం హత్య ఉదంతం తెలియడంతో రాత్రి వచ్చిన వారే అయి ఉంటారని పోలీసులకు స్కూటీని చూపారు. దీంతో కేసు విచారణ ప్రారంభించిన పోలీసులు ఖాజాపాషాను, ముస్తాఫాను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించారు. మరో నిందితుడు అప్సర్‌ఖాన్ పరారీలో ఉన్నాడు. ఇద్దరు నిందితులకు రిమాండ్‌కు తరలించి హత్యకు ఉపయోగించిన స్కూటీ, కత్తి, రెండు సెల్‌ఫోన్లను సీజ్ చేశామన్నారు.

యువకుడి హత్య కేసులో నలుగురి అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు

పహాడీషరీఫ్: యువకుడిని దారుణంగా హత్య చేసిన ఘటనలో నలుగురు నిందితులను శనివారం బాలాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిలో బాలుడిని జువైనల్ హోంకు తరలించారు. ఇన్‌స్పెక్టర్ భూపతి తెలిపిన ప్రకారం.. చాంద్రాయణగుట్ట హాఫీజ్‌బాబానగర్‌కు చెందిన సయ్యద్ మునీర్ కుమారుడు సయ్యద్ సమీర్(19) కారు డ్రైవర్, దే కాలనీకి చెందిన మహ్మద్ సోహెల్(20) ఇటీవల గొడవపడ్డారు. అప్పటి నుంచి సమీర్‌పై కోపం పెంచుకున్న సోహెల్ ఎలాగైనా అంతమొందించాలనుకున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 13న రాత్రి 11గంటల సమయంలో సమీర్ ఇంటి సమీపంలో కమ్యూనిటీ హాల్ వద్ద ఉండగా సోహెల్ స్నేహితుడు మైనర్ బాలుడితో కలిసి కిడ్నాప్ చేశారు. ఇరువురూ స్కూటీపై సమీర్‌ను బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాయకల్ కాలనీ గుర్రం చెరువు పరిసరాలకు తీసుకెళ్లి ఛాతి, వీపు, నడుము భాగాల్లో కత్తితో పొడిచారు. రక్తపు మడుగులో కుమారుడు పడిఉన్న విషయాన్ని సమీర్ తండ్రి మునీర్ తెలిసింది. వెంటనే ఆయన చికిత్స నిమిత్తం ఒవైసీ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పడికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు సోహెల్, మైనర్ బాలుడితో పాటు కేసులో పరోక్షంగా ప్రమేయమున్న మహ్మద్ అబ్దుల్ గౌస్ అలియాస్ ఖాలేద్(20), మహ్మద్ అర్బాజ్(20)ను అరెస్ట్ చేశారు. మైనర్‌ను జువైనల్ హోంకు తరలించారు. ఈ విలేకరుల సమావేశంలతో ఎస్ఐ మహేందర్, సైదులు పాల్గొన్నారు.